# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 320 ఆదివారం 14 జూలై 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




### ఒకటో తేదీన వేతనాల

## చెల్లింపు ఉత్తమాటే

- ఇప్పటికీ మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచర్లకు అందని జీతాలు : హరీశ్‌రావు
- గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఆచరణలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నది
- గత 7 నెలల నుండి ఏ నెలలో కూడా 1వ తేదీన వేతనాలు చెల్లించకపోవడం కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిదర్శనం
- గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి విద్యాసంవత్సరానికి పొడిగింపు ఉత్తర్వులు ఇచ్చింది
- కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది

హైదరాబాద్

ఒకటో తేదీనే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఆచరణలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నది అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. దీంతో ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నమనే మాటలు కేవలం పత్రికా ప్రకటనలకు మాత్రమే పరిమితం అవుతున్నాయని తెలిపారు. మోడల్ స్కూల్ టీచర్లకు గత 7 నెలల నుండి ఏ నెలలో కూడా 1వ తేదీన వేతనాలు చెల్లించకపోవడం కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిదర్శనం అని మండిపడ్డారు. ఈనెల 13 రోజులు గడిచినప్పటికీ మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచర్స్ జీతాలు - మిగతా 3లో

# త్వరలోనే జాబ్ క్యాలెండర్

- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సీఎం రేవంత్ కీలక నిర్ణయాలు
- నిరుద్యోగులకు మేలు జరిగేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయి
- నోటిఫికేషన్ల ప్రకారమే ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో ముందుకెళుతోంది
- పదేళ్లు ఉద్యోగాల భర్తీ చేయాలని నిరుద్యోగ యువత కొట్లాడింది
- ఫీజు రీయింబర్స్ మెంట్‌పై త్రిముఖ వ్యూహంతో తమ ప్రభుత్వం ముందుకు వెళ్తుంది
- దేశంలో, ప్రపంచంలో గొప్ప నిర్మాణాలన్నీ ఇంజనీర్లు సృష్టించినవే
- "కేవలం ఉద్యోగాలను సృష్టించే సంస్థలుగా కాదు..
- దేశానికి మేధావులను అందించే సంస్థలుగా ఇంజనీరింగ్ సంస్థలు ఉండాలి.
- ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టిందే కాంగ్రెస్: రేవంత్ రెడ్డి



హైదరాబాద్


తొలిసారి పీజు రీయింబర్స్‌మెంట్ అన్నది ప్రవేశపెట్టిందే కాంగ్రెస్ ప్రభుత్వమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇంజినీరింగ్ కళాశాలలకు సాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన - మిగతా 3లో

### బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బెదిరించి

## కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు



- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి సంచలన ఆరోపణలు
- రేవంత్ బాబా.. డజను దొంగలుగా పాలన నడుస్తోంది
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చాలామంది బీజేపీతో టచ్‌లో ఉన్నారు
- అయితే రాజీనామా చేసి రావాలని షరతు ఉండటంతో వెనుకడుగు వేస్తున్నారేమో
- కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇంకా అమలు చేయలేదు



## కాంగ్రెస్ తప్పులను మనం చేయొద్దు

- బీజేపీకి గడ్కరీ హెచ్చరిక
- భిన్నత్వం ఉన్న పార్టీ బీజేపీ అన్న ఎల్‌కే అద్వానీ వ్యాఖ్యలను గుర్తు చేశారు.
- అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పుల వల్లనే ప్రజలు బీజేపీని ఎన్నుకున్నారు
- 'కాంగ్రెస్ చేసిన పనిని మనం కొనసాగిస్తే, వారి నిష్క్రమణ, మన ప్రవేశం వల్ల ప్రయోజనం ఉండదు'



### భయపెడుతున్న మరో ప్రాణాంతక వైరస్

- నలుగురు చిన్నారులు మృతి
- ఇంకా పూర్తిగా తగ్గని కరోనా వైరస్ ప్రభావం
- రకరకాల వేరియెంట్‌లతో తన పంజా విసురుతూనే ఉంది
- ఇప్పుడు తాజాగా చాందిపుర అనే వైరస్‌తో గుబులు

# డ్రగ్స్ వల్ల యువత నిర్వీర్యం



- కుటుంబ వ్యవస్థలు విచ్ఛిన్నం కావడం వల్లే పిల్లలు పక్కదారి పడుతున్నారు
- విద్యార్థులకు మంచి చెడులు చెప్పాల్సిన బాధ్యత మన పైనే ఉందన్న సీఎం
- విద్యార్థులందరూ మన పిల్లలు అనేలా అందరూ చూసుకోవాలని సూచన
- తల్లిదండ్రులు తమ పిల్లలకు సమయం కేటాయించాలని సూచన
- స్కూళ్లలో డ్రగ్స్ కట్టడికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- డ్రగ్స్ కట్టడికి హైస్కూళ్లలో ప్రహరీ క్లబ్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయం
- ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పోలీసులు, విద్యార్థులతో కలిసి ఏర్పాటు

హైదరాబాద్

కుటుంబ వ్యవస్థలు విచ్ఛిన్నం కావడం వల్లే చాలామంది పిల్లలు పక్కదారి పడుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులకు మంచి చెడులు చెప్పాల్సిన బాధ్యత మన పైనే ఉందన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, మహిళల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... విద్యార్థులందరూ మన పిల్లలు అనేలా అందరూ చూసుకోవాలని సూచించారు. డ్రగ్స్ వల్ల - మిగతా 3లో

# బెడిసికొడుతున్న వ్యూహం

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఆకర్షించి ప్రభుత్వాన్ని సుస్థిరం చేయాలని భావిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- కొంతమంది కాంగ్రెస్ నేతలు వలస ఎమ్మెల్యేలతో కలవకుండా పార్టీని మరింత సంక్షోభంలోకి నెట్టేస్తున్నారనే అభిప్రాయం
- కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలనే రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యుల వ్యూహం బెడిసికొడుతున్న సంకేతాలు
- రాష్ట్రంలో ఇప్పటివరకు పార్టీలో చేరిన నేతలతో కొత్త పాత అని రెండు వర్గాలుగా విడిపోతోందని టాక్



హైదరాబాద్

తెలంగాణ కాంగ్రెస్ పరిస్థితి ఆగమ్య గోచరంగా తయారైంది. ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కాంగ్రెస్‌లో చేర్చుకొని ప్రతిపక్షాన్ని వీక్ చేయడం.. ఎట్ ది సేమ్ టైం.. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలనే రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యుల వ్యూహం బెడిసికొడుతున్న సంకేతాలు కన్పిస్తున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఆకర్షించి ప్రభుత్వాన్ని సుస్థిరం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తుండగా, కొంతమంది కాంగ్రెస్ నేతలు? వలస ఎమ్మెల్యేలతో కలవకుండా పార్టీని మరింత సంక్షోభంలోకి నెట్టేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో ఇప్పటివరకు ఏడుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటే? ఆయా నియోజకవర్గాల్లో అప్పటికే ఉన్న నేతలు కొత్తగా వచ్చిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో దూరంగా ఉంటుండటంతో పార్టీ రెండు వర్గాలుగా విడిపోతోందని టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేలను చేర్చుకోడాన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ నేతలు వారితో అస్సలు కలిసేందుకు ఇష్టపడటం లేదని చెబుతున్నారు. తమ రాజకీయ ప్రత్యర్థులను కాంగ్రెస్‌లో చేర్చుకుని, తమకు సరైన గౌరవం ఇవ్వడం లేదని ఎక్కువమంది మదనపడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ సమస్య దాదాపు ప్రతినియోజకవర్గంలోనూ కనిపిస్తుండటంతో పాత, కొత్త నేతల మధ్య సమన్వయం కాంగ్రెస్ పెద్దలకు తలనొప్పిగా మారిందంటున్నారు. హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే కూడా లేకపోగా, - మిగతా 3లో


# భయపెడుతున్న మరో ప్రాణాంతక వైరస్




కరోనా వైరస్ ప్రభావం ఇంకా పూర్తిగా తగ్గలేదు. రకరకాల వేరియెంట్‌లతో తన పంజా విసురుతూనే ఉంది. ఇలాంటి తరుణంలో మరిన్ని ప్రాణాంతక వ్యాధులు పుట్టుకొస్తున్నాయి. ప్రజల జీవితాన్ని అస్తవ్యస్తం చేస్తూ.. అల్లకల్లోల వాతావరణం సృష్టిస్తున్నాయి. ఇప్పుడు తాజాగా చాందిపుర అనే వైరస్ గుబులు పుట్టిస్తోంది. ఇప్పటికే దీని బారిన పడి నలుగురు పిల్లలు మృతి చెందారు. మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. దీంతో.. అధికారులు అప్రమత్తమయ్యారు. ఇటీవల గుజరాత్‌లోని సబర్‌కాంతా జిల్లాలో నలుగురు పిల్లలు జ్వరం, ఫ్లూ వంటి లక్షణాలతో ఆసుపత్రిలో చేరారు. అయితే.. కొన్ని రోజుల్లోనే వాళ్లు చనిపోయారు. జులై 10వ తేదీన వాళ్లు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో.. వారి కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. చాందిపుర వైరస్ వల్లే వీళ్లు మృతి చెంది ఉంటారని హిమ్మత్‌నగర్ ఆసుపత్రి పీడియాట్రిక్ వైద్యులు భావిస్తున్నారు. మరో ఇద్దరు చిన్నారుల్లోనూ అవే లక్షణాలు కనిపించడంతో.. వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. మొత్తం ఆరుగురు పిల్లల రక్త నమూనాలను సేకరించి.. పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవి)కి పంపారు. వాటి ఫలితాల కోసం వేచి చూస్తున్నామని సబర్‌కాంత జిల్లా ఆరోగ్యవాఖ అధికారి రాజ్ సుతారియా వెల్లడించారు.

కాగా.. ఈ చాందిపుర వైరస్ మెదడువాపుకు కారణమవుతుంది. ఇది సోకిన కొన్ని రోజుల్లోనే రోగి మరణిస్తాడు. ఇది దోమలు, పురుగుల ద్వారా వ్యాపిస్తుంది. ఈ వైరస్ సోకిన వారిలో జ్వరం, ఫ్లూ వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. ఈ వైరస్ కారణంగా నలుగురు పిల్లలు రోజుల వ్యవధిలోనే మృతి చెందడంలో.. అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఈ వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు.. ప్రభావిత ప్రాంతాల్లో పురుగులను చంపేస్తున్నారు. ప్రజలు సైతం అలర్ట్‌గా ఉండాలని, అసురక్షిత ప్రాంతాల్లో ఎక్కువగా సంచరించొద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఎవరిలోనైనా జ్వరం, ఫ్లూ వంటి లక్షణాలు కనిపిస్తే.. వెంటనే దగ్గరలోని ఆసుపత్రిలో చేరి, చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు.

## కాంగ్రెస్ తప్పులను మనం చేయెద్దు..



**పనాజీ:** కాంగ్రెస్‌ను అధికారం నుంచి గద్దె దింపడానికి దారితీసిన తప్పిదాలను బీజేపీ పునరావృతం చేయవద్దని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈ మేరకు సొంత పార్టీని హెచ్చరించారు. భిన్నత్వం ఉన్న పార్టీ బీజేపీ అన్న ఎల్‌కే అద్వానీ వ్యాఖ్యలను గుర్తు చేశారు. శుక్రవారం గోవాలో జరిగిన పార్టీ అత్యున్నత స్థాయి సమావేశంలో నితిన్ గడ్కరీ మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పుల వల్లనే ప్రజలు బీజేపీని ఎన్నుకున్నారని తెలిపారు. 'కాంగ్రెస్ చేసిన పనిని మనం కొనసాగిస్తే, (అధికారం నుంచి) వారి నిష్క్రమణ, మన ప్రవేశం వల్ల ప్రయోజనం ఉండదు' అని అన్నారు. కాగా, తన గురువు, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ వ్యాఖ్యలను ఈ సందర్భంగా నితిన్ గడ్కరీ ప్రస్తావించారు. 'మనది భిన్నత్వం ఉన్న పార్టీ అని అద్వానీ చెప్పేవారు. ఇతర పార్టీల కంటే మనం ఎంత భిన్నంగా ఉన్నామో అర్థం చేసుకోవాలి' అని అన్నారు. మరోవైపు రాబోయే రోజుల్లో దేశంలో సామాజిక, ఆర్థిక సంస్కరణలు తీసుకురావడానికి రాజకీయాలు ఒక సాధనమని, పార్టీ కార్యకర్తలు ఇది తెలుసుకోవాలని నితిన్ గడ్కరీ తెలిపారు. సొంత రాష్ట్రమైన మహారాష్ట్ర రాజకీయాలను ఆయన ప్రస్తావించారు. కుల ప్రాతిపదికన రాజకీయాలు చేయకూడదని సూచించారు. 'ఈ ధోరణిని అనుసరించకూడదని నేను నిర్ణయించుకున్నా. కుల ఆధారిత రాజకీయాలు చేయబోనని ప్రజలకు చెప్పా. కులం గురించి మాట్లాడే వారికి బలమైన కిక్ వస్తుంది' అని అన్నారు. అలాగే అవినీతి రహిత దేశాన్ని సృష్టించడానికి సరైన ప్రణాళిక చేయాలని పార్టీకి పిలుపునిచ్చారు.

## ఎయిమ్స్ నుంచి రాజ్‌నాథ్ సింగ్ డిశ్చార్జి




**న్యూఢిల్లీ:** వెన్నునొప్పి కారణంగా ఎయిమ్స్‌లో చేరిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. రెండ్రోజుల క్రితం ఆయన వెన్నునొప్పి కారణంగా ఆసుపత్రిలోని న్యూరోసర్జరీ విభాగంలో చేరారు. నొప్పి తీవ్రతను గుర్తించి చికిత్స అందించామని, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని ఎయిమ్స్ మెడికల్ సెల్ ఇన్‌చార్జి డాక్టర్ రీమా దాదా తెలిపారు. రాజ్‌నాథ్ సింగ్ మూడ్రోజుల క్రితమే 73వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఆయనకు మోదీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కఠోర శ్రమ, సేవాభావంతో ప్రజల మన్ననలను రాజ్‌నాథ్ అందుకున్నారని, రక్షణ శాఖ మంత్రిగా భారతదేశ రక్షణ సంపత్తిని పటిష్టం చేయడంలో ముందున్నారని అన్నారు. రాజ్‌నాథ్ సింగ్ చిరకాలం ఆయురారోగ్యాలతో ఉండాలని తన సందేశంలో మోదీ అభిలషించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్‌నాథ్ ఆర్ఎస్ఎస్ విద్యార్థి విభాగమైన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సభ్యుడిగా తన కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత బీజేపీ యువజన విభాగంలో చేరారు. వివాదరహితుడిగా పేరున్న ఆయన ప్రస్తుతం లక్నో లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వరుసగా రెండోసారి రక్షణ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2014లోనూ మోదీ తొలి మంత్రివర్గంలో క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు. 1977-80, 2001-2003 వరకూ ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యేగా, 1991 నుంచి 1992 వరకూ యూపీ విద్యాశాఖ మంత్రిగా, 1999 నుంచి 2000 వరకూ కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రిగా ఆయన పనిచేశారు. 2000-2002లో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా సేవలందించారు. 2003లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు.

## ఉపఎన్నికల్లో బీజేపీకి షాక్



10చోట ఇండియా కూటమి

దేశవ్యాప్తంగా జరిగిన 13 ఉప ఎన్నికల్లో 10 చోట్ల ఇండియా కూటమి, రెండుచోట్ల బీజేపీ, ఒకచోట స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. దేశవ్యాప్తంగా 7 రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి. ఉపఎన్నికలు జరిగిన నాలుగు రాష్ట్రాల్లో ఇండియా కూటమి, మూడు రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి అధికారంలో ఉంది. పశ్చిమ బెంగాల్‌లో 4, హిమాచల్ ప్రదేశ్‌లో 3, ఉత్తరాఖండ్‌లో 2, పంజాబ్, బీహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ఒక్కో స్థానంలో ఉప ఎన్నికలు జరిగాయి. హిమాచల్ ప్రదేశ్‌లో డెహ్రా, నలాగఢ్ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోగా, హమీర్‌పూర్ స్థానంలో బీజేపీ విజయం సాధించింది. మధ్యప్రదేశ్‌లోని అమరవారా నుంచి బీజేపీ అభ్యర్థి కమలేశ్ ప్రతాప్ షా విజయం సాధించారు. పంజాబ్‌లోని జలంధర్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ, తమిళనాడులోని విక్రవాండిలో డీఎంకే, ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్, మంగ్లౌర్‌లలో కాంగ్రెస్ గెలుపొందింది. పశ్చిమ బెంగాల్‌లోని రాయ్‌గంజ్, రణఘాట్ సౌత్, బాగ్దా, మానిక్తలాలో తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. బీహార్‌లోని రూపౌలిలో స్వతంత్ర అభ్యర్థి గెలిచారు.

## ట్రంప్‌కు భారీ విరాళం..


టెస్లా అధినేత, ఎక్స్ చైర్ పర్సన్ ఎలాన్ మస్క్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు భారీ విరాళం అందజేశారు. రిపబ్లికన్ల తరఫున బరిలోకి దిగిన డొనాల్డ్ ట్రంప్‌నకు భారీ మొత్తంలో నగదు అందజేశారని బ్లూమ్‌బర్గ్ నివేదించింది. నేరుగా ట్రంప్‌కి కాకుండా అమెరికా పీఏసీ (పొలిటికల్ యాక్షన్ కమిటీ)కి డొనేట్ చేశారు. ఈ కమిటీ ట్రంప్ తరఫున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి నగదు అందజేసిన సంస్థలు/ వ్యక్తుల పేర్లను 15వ తేదీన (సోమవారం) పీఏసీ వెల్లడించనుంది.

## మనుస్మృతి కాపీలను మోదీ, రాహుల్ తగలబెట్టాలి



**ముంబై:** ఒకవేళ ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తే, అప్పుడు వాళ్లు మనుస్మృతి కాపీలను తగులబెట్టాలని వంచిత్ బహుజన్ అగాఢీ వ్యవస్థాపకుడు ప్రకాశ్ అంబేద్కర్ తెలిపారు. రాజ్యాంగాన్ని రాసిన బాబా సాహెబ్ అంబేద్కర్ మనువడే ప్రకాశ్ అంబేద్కర్. ఆయన ఓ న్యాయవాది, రాజకీయవేత్త, సామాజిక కార్యకర్త. గతంలో రాజ్యసభ, లోక్‌సభ సభ్యుడిగా చేశారు. ఒవకేళ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నిజంగా రాజ్యాంగాన్ని ప్రేమిస్తే, అప్పుడు మనుస్మృతి కాపీలను తగులబెట్టాలని మోదీ, రాహుల్‌ను డిమాండ్ చేస్తున్నట్లు ప్రకాశ్ అంబేద్కర్ తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రాజ్యాంగాన్ని వెన్నుపోటు పొడిచాయన్నారు. పేదవారిని, అణగారిన కులాలను ఆ పార్టీలు మోసం చేశాయన్నారు. రాజ్యాంగంలో బాబా సాహెబ్ పొందుపరిచిన ఆశయాలను, విలువలకు ఆ పార్టీలు తూట్లు పొడిచాయని ప్రకాశ్ అంబేద్కర్ ఆరోపించారు. న్యాయ విద్యార్థులకు మనుస్మృతి బోధించాలని ఇటీవల ఢిల్లీ వర్సిటీలో ఓ ప్రతిపాదన వచ్చిన విషయం తెలిసిందే. ఆ ప్రతిపాదనను వర్సిటీ వీసీ కొట్టిపారేశారు.


## ఉత్తర భారతదేశాన్ని వణికిస్తున్న వరుణుడు..



రుతు పవనాల ప్రభావంతో ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలు వర్షాలకు అతలాకుతలం అవుతున్నాయి. మరీ ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో పరిస్థితి దారుణంగా ఉంది. ఇక తెలుగు రాష్ట్రాల్లోకి రుతుపవనాలు ప్రవేశించడంతో వర్షాల ప్రభావం స్పష్టంగా తెలుస్తోంది. కుండపోత వర్షాలతో కొన్ని ప్రాంతాల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాలను వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. రెండు జిల్లాల్లోనూ రోడ్లన్నీ జలమయం అయ్యాయి. గుంతల్లోకి వరద నీరు చేరడంతో పలు ప్రాంతాలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రాజమండ్రి, రాజానగరం, చింతూరు, గోకవరం, కోరుకొండ, రంపచోడవరం ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. మోరంపూడి జంక్షన్ వద్ద సైతం నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా ప్రజలకు సైతం వర్షాలు ఇళ్లకే పరిమితం చేశాయి. అలాగే తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో చిరు జల్లులు పడుతుండగా.. భద్రాచలంలో వర్షపు నీటితో పర్ణశాల నీట మునిగింది. దీంతో అధికారులు భక్తులకు అనుమతి నిరాకరిస్తున్నారు. రుతుపవనాల ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ మరికొన్ని రోజులపాటు ఇలాంటి పరిస్థితే కొనసాగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెప్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో ఇదీ పరిస్థితి..!

ఇక ఉత్తర భారతదేశం విషయానికి వస్తే రుతుపవనాల దెబ్బకు ప్రజలు అల్లాడి పోతున్నారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. అసోం, ఉత్తరప్ర దేశ్, ఉత్తరాఖండ్, ముంబై, హిమాచల్, ఢిల్లీ రాష్ట్రాల్లో ప్రయాణం చేయాలంటే నకరం చూడాల్సి వస్తోంది. తాగునీటి కోసం సైతం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటే పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబయి నగరవాసులను సైతం వర్షాలు బెంబేలెత్తిస్తున్నాయి. రెండ్రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోనూ వర్షం బీభత్సం సృష్టిస్తోంది. ఆయా రాష్ట్రాల్లో వర్షాల దెబ్బకు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. పర్యాటక ప్రాంతాల్లోని ప్రజలు సైతం ఎక్కడివారు అక్కడే ఇరుక్కుపోయారు. ఉత్తరాఖండ్‌లో సుమారు వేల ఎకరాల్లో పంట పొలాలు దెబ్బతిన్నట్లు అక్కడి అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక హిమాచల్ ప్రదేశ్‌లో కొండచరియలు విరిగిపడుతున్నాయి. బిహార్‌లో ఏడు జిల్లాల్లోని పలు ప్రాంతాలు వర్షాలకు నీట మునిగాయి. పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గోవా, బిహార్ తదితర రాష్ట్రాల్లో ఐదు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు అత్యవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు.

## స్కైడైవింగ్ చేసిన కేంద్ర పర్యాటక మంత్రి



కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పెద్ద సాహసమే చేశారు. ప్రపంచ స్కై డైవింగ్ డే ను పురస్కరించుకుని శనివారం గగనతలంలో వేగంగా వెళ్తున్న విమానంలో నుంచి ఆయన పారాచూట్‌తో కిందకు దూకారు. అయితే ఒక నిపుణుడి సాయంతో ఆయన ఈ సాహసోపేతమైన ఫీట్‌లో పాల్గొన్నారు. విమానం నుంచి వారు దూకిన కొద్ది క్షణాలకు పారాచ్యూట్ తెరుచుకుంది. ఆ తర్వాత మేఘాల మీద తేలియాడుతూ వారు భూమి మీదకు చేరుకున్నారు. లేటు వయసులో కేంద్ర మంత్రి చేసిన ఈ సాహసాన్ని కింది వీడియోలో మీరే స్వయంగా చూడండి..

# వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నా ఎమర్జెన్సీ విధించి ఉండేవారు



**ముంబై:** దేశ చరిత్రలో అత్యంత వివాదాస్పదమైన అత్యవసర పరిస్థితి విధించిన జూన్ 25వతేదీని 'రాజ్యాంగ హత్యా దినం'గా ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని శివసేన నేత, పార్లమెంటు సభ్యుడు సంజయ్ రౌత్ తప్పుపట్టారు. ఎమర్జెన్సీని సమర్థించారు. అటల్ బిహారీ వాజ్‌పేయి అప్పట్లో ప్రధానిగా ఉన్నా అప్పటి పరిస్థితిని బట్టి ఎమర్జెన్సీ విధించి ఉండేవారని అన్నారు. ఎమర్జెన్సీని శివసేన వ్యవస్థాపకుడు బాలాసాహెబ్ థాకరే, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కూడా బహిరగంగంగానే సమర్థించినట్టు శనివారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ ఆయన చెప్పారు. ''వారికి మరో పని లేదు. ఇది (ఎమర్జెన్సీ) జరిగి 50 ఏళ్లయింది. ప్రజలు కూడా ఎమర్జెన్సీని మరిచిపోయారు. ఈ దేశంలో ఎమర్జెన్సీ ఎందుకు విధించారు? కొందరు వ్యక్తులు దేశంలో అరాచకవాదాన్ని వ్యాప్తి చేయాలనుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలు పాటించవద్దని రామ్‌లీలా మైదాన్ నుంచి మన జవాన్లు, ఆర్మీకి పిలుపునిచ్చారు. అలాంటి పరిస్థితిలో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నా ఆయన కూడా ఎమర్జెన్సీ విధించేవారు. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన అంశం. కొందరు వ్యక్తులు దేశంలో బాంబులు తయారు చేస్తూ వివిధ ప్రాంతాల్లో బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు. అమిత్‌షాకు ఎమర్జెన్సీ గురించి ఏమీ తెలియదని నేను చెప్పదలచుకున్నాను. అప్పట్లో బాలాసాహెబ్ థాకరే కూడా ఎమర్జెన్సీకి సపోర్ట్ చేశారు. ఆర్ఎస్ఎస్ సైతం సపోర్ట్ చేసింది'' అని సంజయ్ రౌత్ తెలిపారు.

### ఇందిరను సపోర్ట్ చేసిన బాలాసాహెబ్

''శివసేన నేత బాలాసాహెబ్ థాకరే సైతం 1975 ఎమర్జెన్సీని, ఇందిరాగాంధీని బహిరంగంగానే సపోర్ట్ చేశారు. ముంబైలో ఆమెకు స్వాగతం పలికారు. దేశంలో అరాచకవాదాన్ని అదుపు చేయడానికి ఎమర్జెన్సీ అవసరమని బాలాసాహెబ్ భావించారు. అందులో తప్పేముంది? బీజేపీ పదేళ్ల పాలనలో జరిగిందేమిటి? వాళ్లు రాజ్యాంగ పరిరక్షకులు కూడా కాదు'' అని సంజయ్ రౌత్ చెప్పరు. ఎమర్జెన్సీ సమయంలో కూడా రాజ్యాంగాన్ని హత్య చేశారని వాజ్‌పేయి భావించలేదని అన్నారు. ఆ తర్వాతే వాజ్‌పేయి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. రాజ్యాంగాన్ని హత్య చేశారని అటల్‌జీనే అననప్పుడు వాళ్లెవరు? అని బీజేపీని ప్రశ్నించారు. చేసేందుకు పనేమీ లేకపోవడంతో వల్లే వారు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని, ఎమర్జెన్సీ గురించి మాట్లాడదలిస్తే మోదీ పదేళ్ల పాలనలో ప్రతిరోజూ ప్రజాస్వామ్యం హత్యకు గురవుతున్న విషయాన్ని కూడా గుర్తుచేసుకోవాలని సంజయ్ రౌత్ స్పష్టం చేశారు.

## బద్రీనాథ్, మంగళౌర్‌లో కాంగ్రెస్ విక్టరీ



**డెహ్రాడూన్:** కాంగ్రెస్ పార్టీ ఉత్తరాఖండ్‌లోని రెండు కీలక అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో విజయం సాధించింది. బద్రీనాథ్, మంగళౌర్‌లో విజయకేతనం ఎగురవేసింది. జూలై 10వ తేదీన జరిగిన ఉపఎన్నికల ఫలితాలను శనివారంనాడు ప్రకటించారు. ఎన్నికల కమిషన్ ప్రకటించిన ఎన్నికల ఫలితాల్లో బద్రీనాథ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి లఖ్‌పట్ సింగ్ బుటోలా 28,161 ఓట్లు సాధించి గెలుపు సొంతం చేసుకున్నారు. మంగళౌర్ నుంచి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి క్వాజీ మొహమ్మద్ నిజాముద్దీన్ 31,727 ఓట్లు సాధించి విజయాన్ని సాధించారు. ఓవైపు ఫలితాలు వెలువడుతుండగానే కాంగ్రెస్ కార్యకర్తలు గెలుపు సంబరాలు చేసుకున్నారు.

# త్వరలోనే జాబ్ క్యాలెండర్

-మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ.. జేఎన్టీయూ పరిధిలో కళాశాలల నిర్వాహకులకు ప్రభుత్వ విధానం తెలియాలన్నారు. ప్రభుత్వ విధానాలు అందరికీ తెలిసేలా ప్రస్తుత కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి విషయంలో ప్రభుత్వ విధానం చాలా కీలకమన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఫీజు రీయింబర్సుమెంట్స్ బకాయిలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కళాశాలలు నిరుద్యోగులను తయారు చేసే పరిశ్రమలుగా ఉండకూడదని వ్యాఖ్యానించారు. అభివృద్ధి చెందుతున్న దేశానికి సివిల్ ఇంజినీరింగ్ అత్యంత అవసరం అన్నారు. కళాశాలల్లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులను కచ్చితంగా నిర్వహించాలన్నారు. ఈ కోర్సులు లేకుంటే దేశం ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని హెచ్చరించారు. గత ముఖ్యమంత్రుల నిర్ణయాల కారణంగా మనం ఫార్మా, ఐటీ రంగాల్లో ముందున్నామని ప్రశంసించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని కోర్సులు ఉండాలన్నారు. ఫార్మా, ఐటీ తర్వాత ఏఐ ప్రపంచాన్ని నడిపించబోతోందన్నారు. రాష్ట్రంలోని కళాశాలల్లో ఏఐకి సంబంధించిన కోర్సులను కూడా ప్రవేశపెట్టాలన్నారు. ఇందుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉంటుందని హామీ ఇచ్చారు.

ప్రతీ పేదవాడి బిడ్డ గొప్పగా చదవాలని ఆనాడు వైఎస్సాఆర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిర్ణయం తీసుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ విధానాలను వివరించాలనే ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. పలు రకాల పరిస్థితుల్లో ప్రాధాన్యతలు మారి.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని చెప్పారు. జేఎన్టీయూలో క్వాలిటీ ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్‌పై ఈరోజు(శనివారం) ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. పాత బకాయిలపై ఎలా ముందుకెళ్లాలనే అంశాన్ని పరిష్కరించే బాధ్యత మంత్రి శ్రీధర్



బాబుకు అప్పగిస్తున్నామని తెలిపారు. ఈ అకాడమిక్ ఇయర్ నుంచి ఆన్ టైమ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించేందుకు ప్రయత్నిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు.

త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసి అటానమస్ హెూదా ఇస్తామన్నారు. పక్క రాష్ట్రాలతో పోటీపడే విధంగా కాకుండా ప్రపంచంతో పోటీ పడేవిధంగా మనం తయారు కావాలని సూచించారు. తమ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు.

**ఇంజనీరింగ్ కాలేజీలు అలా చేయొద్దు..**

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఎలాంటి అనుమానం అక్కర్లేదని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్‌పై త్రిముఖ వ్యూహంతో తమ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని వ్యాఖ్యానించారు. దేశంలో, ప్రపంచంలో గొప్ప నిర్మాణాలన్నీ ఇంజనీర్లు సృష్టించినవేనని అన్నారు. మానవనిర్మిత అద్భుతాలన్నీ ఇంజనీర్లు ఆవిష్కరించినవేనని గుర్తుచేశారు. ఇంజనీరింగ్ కాలేజీలు నిరుద్యోగులను ఉత్పత్తి చేసే కర్మాగారంగా మారకూడదని సూచించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి దేశ భవిష్యత్తును నిర్మించేలా ఉండాలన్నారు. అందుకు కావాల్సిన సాయాన్ని అందించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డిపేర్కొన్నారు.

ఐటీఐల రూపురేఖలు మారుస్తాం..

"కేవలం ఉద్యోగాలను సృష్టించే సంస్థలుగా కాదు.. దేశానికి మేధావులను అందించే సంస్థలుగా ఇంజనీరింగ్ సంస్థలు ఉండాలి. ఇంజనీరింగ్‌లో కేవలం కంప్యూటర్ సైన్స్ పైనే కాదు... సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ లాంటి అన్ని రకాల కోర్సులనూ ప్రోత్సహించాలి. స్కిల్ డెవలప్మెంట్‌లో భాగంగా టాటా భాగస్వామ్యంతో రూ.2400 కోట్లతో ప్రభుత్వం ఐటీఐల రూపురేఖలు మారుస్తోంది. ఫార్మా, ఐటీ తర్వాత ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రపంచాన్ని నడిపించబోతోంది. యువత కోసం త్వరలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నాం. ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం" అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

**త్వరలోనే జాబ్ క్యాలెండర్..**

"మా ప్రభుత్వానికి భేషజాలు లేవు... నిరుద్యోగులకు మేలు జరిగేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయి. నోటిఫికేషన్ల ప్రకారమే ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో ముందుకెళుతోంది. పదేళ్లు ఉద్యోగాల భర్తీ చేయాలని నిరుద్యోగ యువత కొట్లాడింది. కానీ.. ఇప్పుడు పరీక్షల వాయిదా కోసం కొన్ని రాజకీయ శక్తులు, కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఆమరణ దీక్షలు చేస్తున్నారు. త్వరలోనే జాబ్ క్యాలెండర్‌ను తీసుకురాబోతున్నాం. యూపీఎస్సీ తరహాలో ప్రతీ ఏటా క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తాం. విద్యాసంస్థలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారకూడదనేదే మా ప్రభుత్వ విధానం. మేం అధికారంలోకి వచ్చిన మొదటి 30రోజుల్లోనే 30వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. ఆర్థిక భారం, ఇతర సమస్యలు ఉన్నా... ఒక్కొక్కటి పరిష్కరించుకుంటూ మా ప్రభుత్వం ముందుకు వెళుతోంది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# బెడిసికొడుతున్న వ్యూహం

-మొదటిపేజీ తరువాయి

తొలుత ఖైరతాబాద్ శాసనసభ్యుడు దానం నాగేందర్‌ను ఆకర్షించి పార్టీలోకి ఆహ్వానించారు. కానీ, నాగేందర్‌కు ప్రత్యర్థిగా కాంగ్రెస్ తరపున పోటీ చేసిన విజయారెడ్డి మాత్రం దానం చేరికను సహించలేకపోతున్నారు. దానం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని దాదాపు నాలుగైదు నెలలు కావస్తున్నా, విజయారెడ్డితో సయోధ్య కుదరడం లేదంటున్నారు. దానం నాగేందర్ రాకను వ్యతిరేకిస్తూ.. పి.విజయారెడ్డి అనుచరులు ఏకంగా గాంధీభవన్‌లో నిరసనకు దిగారు. అయినా ఈ ఇద్దరి మధ్య రాజీ కుదర్చడంలో కాంగ్రెస్ నాయకత్వం పెద్దగా దృష్టి పెట్టినట్లు లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఖైరతాబాద్‌కు చెందిన ఈ ఇద్దరూ ఇప్పటివరకు ఒకరి ముఖాలు ఒకరు చూసుకోలేని పరిస్థితి ఏర్పడింది.ఇక స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేరిక విషయంలోనూ ఇదే సీన్ కనిపించింది. కడియం శ్రీహరికి ప్రత్యర్థిగా పోటీ చేసిన కాంగ్రెస్ మహిళా నాయకురాలు ఇందిర? కడియంతో ఎడమొహం పెడమొహంగానే వ్యవహరిస్తున్నారు. కడియం చేరికను ఇందిర వర్గం తీవ్రంగా వ్యతిరేకించిన విషయం తెలిసిందే. అదే విధంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం చేరికను ఆయనపై ఓడిన ఏనుగు రవీందర్ రెడ్డితో పాటు స్థానిక కాంగ్రెస్ క్యాడర్ ఇప్పటికీ జీర్ణించుకోవడం లేదని టాక్ నడుస్తోంది.ఇక జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ చేరిన తర్వాత జరిగిన రచ్చ అంతా ఇంతా కాదు. ఎప్పుడూ లాస్ట్ చాన్స్ అంటూ ఎన్నికల్లో పోటీ చేసే ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి.. తన స్థానంలో మరొకరు నియోజకవర్గానికి రావడాన్ని ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నారు. ఏకంగా ఢిల్లీ స్థాయిలో నిరసనకు దిగడమే కాకుండా, తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానంటూ హైకమాండ్ కే హెచ్చరికలు పంపారు. కాంగ్రెస్ పెద్దలు సర్ది చెప్పడంతో జీవన్‌రెడ్డి మెత్తపడినా, ఎమ్మెల్యే సంజయ్‌తో చేతులు కలిపే విషయంలో మాత్రం ససేమిరా అంటున్నారు.జీవన్‌రెడ్డి ఎపిసోడ్



మరచిపోకముందే తాజాగా కాంగ్రెస్‌లో చేరిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి విషయంలోనూ ఇదే స్థాయిలో రచ్చ జరిగింది. గద్వాలలో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన సరిత తిరుపతయ్యతోపాటు ఆమె అనుచరులు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే రాకను తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సరితకు నచ్చజెప్పినా ఆమె అనుచరులు వినలేదు. గద్వాల నుంచి వందల సంఖ్యలో గాంధీభవన్‌కు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు దుమ్ము లేపారుఇలా దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ సమస్యలు ఉన్నాయని? పాత, కొత్త కాంగ్రెస్ అంటూ విభజన రేఖ గీసుకుని క్యాడర్ గ్యాప్ మెయింటైన్ చేస్తోందని అంటున్నారు. దీని వల్ల కాంగ్రెస్ మరింత బలపడాలనే ప్లాన్ బెడిసికొట్టే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు విశ్లేషకులు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్న నేతల విషయంలో పార్టీ పెద్దలు ముందుగానే మాట్లాడి పాత క్యాడర్‌ను ఒప్పిస్తే ఇలాంటి సమస్య ఎదురయ్యేది కాదంటున్నారు. సమస్యలు వచ్చిన నియోజకవర్గాల్లో ఎక్కువ రాత్రికి రాత్రి నిర్ణయం తీసుకున్నవే కావడంతో రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ గ్యాప్ అనేది నామినేటెడ్ పోస్టులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో టిక్కెట్ పంచాయతీతో మరింత ముదిరే అవకాశాలే ఉన్నాయని కేడర్ భావిస్తోంది.

## ఒకటో తేదీన వేతనాల చెల్లింపు ఉత్తమాటే..

-మొదటిపేజీ తరువాయి



అందక అనేక ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నెల 8వ తేదీన సగం మంది ఉద్యోగులకు మాత్రమే వేతనాలు చెల్లించిన సర్కారు, రంగారెడ్డి, నిజామాబాద్, వనపర్తి, సూర్యపేట, సంగారెడ్డి, సిద్దిపేట, సిరిసిల్ల, పెద్దపల్లి మొత్తం 8 జిల్లాలో పని చేస్తున్న వెయ్యి మందికి పైగా రెగ్యులర్ టీచర్లకు ఇంకా వేతనాలు చెల్లించలేదు. వీరితో పాటు మోడల్ స్కూల్స్‌లో పని చేసే ఔట్ సోర్సింగ్, హవర్లీ బేస్డ్ టీచర్స్ దాదాపు 2వేల మందికి ప్రభుత్వం వేతనాలు చెల్లించలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులను గౌరవించి ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేసే గెస్ట్ లెక్చరర్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పడం బాధాకరం అని హరీశ్‌రావు అన్నారు. అధికారంలోకి రాగానే రూ. 42 వేల వేతనం చెల్లిస్తామని అభయహస్తం మేనిఫెస్టోలో చెప్పిన కాంగ్రెస్ పార్టీ, వారి ఉద్యోగ భవిష్యత్‌ను దెబ్బతీసేలా కేవలం మార్చి 31 నుంచి జులై 31 వరకే కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వడం దుర్మార్గం. ఇందులో ఏప్రిల్, మే నెలల్లో సెలవులే ఉండగా, కేవలం జూన్, జులై నెలకు మాత్రమే పొడిగింపు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఈ నిర్ణయం వల్ల గత 10 సంవత్సరాలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న1654 మంది గెస్ట్ లెక్చరర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి వచ్చింది అని హరీశ్‌రావు తెలిపారు.

విద్యాసంవత్సరం మధ్యలో ఉద్యోగాలు నిలిపివేస్తే, ఎలా బతికేది అని లెక్చరర్లు, వారి కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి విద్యాసంవత్సరానికి పొడిగింపు ఉత్తర్వులు ఇచ్చింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. గెస్ట్ లెక్చరర్ల వ్యవస్థను ఎత్తేసేందుకు కుట్ర చేస్తున్నట్లు వారు ఆందోళనలో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం స్పందించి సమస్యలు పరిష్కరించాలి. అభయహస్తం మేనిఫెస్టోలో హామి ఇచ్చినట్లుగా గెస్ట్ లెక్చరర్లకు భరోసా ఇవ్వడంతో పాటు, నెలకు రూ. 42 వేల వేతనం చెల్లించి, విద్యాసంవత్సరం చివరి వరకు ఉద్యోగ కాలాన్ని పొడగించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బెదిరించి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు..



బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బెదిరించి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చాలామంది బీజేపీతో టచ్‌లో ఉన్నారని.. అయితే రాజీనామా చేసి రావాలని షరతు ఉండటంతో వెనుకడుగు వేస్తున్నారేమోనని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఎప్పుడైనా ఏమైనా జరగొచ్చంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇంకా అమలు చేయలేదని మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. మేనిఫెస్టోల ఇచ్చిన 419 హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో అతి తక్కువ కాలంలో అప్రతిష్ట మూటకట్టుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ అని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అమృత్ పథకం నిధుల టెండర్లలో జరిగిన అవినీతిని నిరూపించేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. గ్లోబల్ టెండర్లలో 40 శాతం లెస్‌కు పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే తాను రాజీనామాకు సిద్ధమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లుగా ఉందని మహేశ్వర్ రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రజల సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదని మండిపడ్డారు. జవాబుదారీతనం లేదని.. పారదర్శకత లేదని విమర్శించారు. పేరుకే ప్రజాపాలన.. ప్రజాదర్బార్ కనరాకుండా పోయిందని తెలిపారు. ప్రజాపాలన పేరు మీద రాక్షస పాలన సాగుతోందని చెప్పారు. రేవంత్ బాబా.. దజను దొంగలుగా పాలన నడుస్తోందని ఎద్దేవా చేశారు. రేవంత్ అవినీతి పాలనపై బీజేపీ పోరాటం చేస్తుందని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రజాక్షేత్రంలో అవినీతిని బయటపెడతామని చెప్పారు.

## డ్రగ్స్ వల్ల యువత నిర్వీర్యం

-మొదటిపేజీ తరువాయి

యువత నిర్వీర్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సమయం కేటాయించాలని సూచించారు. వారికి మంచి చెడులు చెప్పాలన్నారు.

**స్కూళ్లలో డ్రగ్స్ కట్టడికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం**

తెలంగాణలోని పాఠశాలల్లో డ్రగ్స్‌ను కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డ్రగ్స్‌ను అరికట్టేందుకు హైస్కూళ్లలో ప్రహరీ క్లబ్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పోలీసులు, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులతో కలిసి ప్రహరీ క్లబ్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు తెలంగాణ పాఠశాల విద్యా కమిషనర్‌కు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

# ఒరిస్సా టూ వేములవాడ జైల్‌లో పరిచయం... గంజాయి స్మగ్లింగ్?

**కరీంనగర్ :** యువత బతుకును నాశనం చేస్తున్న గంజాయి, డ్రగ్స్ ను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతుంది. గంజాయి వాసన లేకుండా సమూలంగా నిర్మూలించేందుకు పోలీసులు నిఘా పెట్టగా ప్రముఖ పుణ్యక్షేత్రాలైన వేములవాడలో మొన్న గంజాయి ముఠా పట్టుబడగా, తాజాగా ధర్మపురి లో మరో ముఠా పట్టుబడింది.ఒడిశా వయా ఏపీ మీదుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు గంజాయి సప్లై చేస్తూ యువత బతుకు ఆగం చేస్తున్న స్మగ్లర్ ల ఆటపట్టిస్తున్నారు పోలీసులు. వారం రోజుల్లో రెండు ముఠాలకు చెందిన ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి దాదాపు 20 కిలోల ఎండు గంజాయిని, కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు.దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడలో వారం రోజుల క్రితం గంజాయి స్మగ్లర్ ఒడిస్సా కు చెందిన పుర్థి బిర్సా పోలీసులు అరెస్టు చేసి 14 కిలోల 590 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అది మరిచిపోకముందే తాజాగా ధర్మపురి పోలీసులకు మరో ముఠా పట్టుబడింది. ధర్మపురి లో పట్టుబడ్డ ముఠాకు చెందిన ఐదుగురిని పోలీసులు అరెస్టు చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. పట్టుబడ్డ వారి నుంచి 6.03 కిలోల గంజాయి, మూడు సెల్ ఫోన్ లు, 3500 నగదు స్వాధీనం చేసుకున్నారు.జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎస్పీ అశోక్ కుమార్ సమక్షంలో అరెస్టు అయిన గంజాయి స్మగ్లర్ లను చూపించి వివరాలు వెల్లడించారు. ధర్మపురి మండలం దొంతాపూర్ కు చెందిన దుర్గం రాము, సునర్కాని అజయ్, మగ్గిడి గ్రామానికి చెందిన దుర్గం సంజయ్, రాయపట్నం కు చెందిన బత్తిని చందు,గొల్ల వెంకటేష్ ముఠాగా ఏర్పడి గంజాయి స్మగ్లింగ్ తోపాటు విక్రయిస్తున్నారని ఎస్పీ తెలిపారు.ఈ ఐదుగురు ఒడిస్సా లో గంజాయి పండించే దినేష్ కుమార్ నాయక్ నుంచి ఏపి విజయనగరం కు చెందిన గుజ్జల పురుషోత్తం ద్వారా కొనుగోలు చేసి ధర్మపురి తోపాటు పలు ప్రాంతాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. ఈనెల 4న బత్తిని చందు, గొల్ల వెంకటేష్, దుర్గం రాము లపై ధర్మపురి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి చందు, వెంకటేష్‌లను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపామని తెలిపారు. పరారీలో ఉన్న రాము కోసం గాలిస్తుండగా ధర్మపురి మండలం బుద్దేష్‌పల్లి వద్ద రాము తోపాటు ఒడిస్సా కు చెందిన దినేష్ కుమార్ నాయక్, విజయనగరం కు చెందిన గుజ్జల పురుషోత్తం చిక్కారని తెలిపారు. అజయ్, దుర్గం సంజయ్ పరారీలో ఉన్నట్లు ప్రకటించారు.రెండేళ్ల క్రితం ఒడిశా చెందిన దినేష్ కుమార్ నాయక్, ఏపీకి చెందిన పురుషోత్తం ముఠాతో పరిచయం ఏర్పడిందని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. అప్పటినుంచి ముఠా సభ్యులు ఒడిశా రాయగడ్ రైల్వే స్టేషన్ కు వెళ్లి అక్కడ దినేష్ కుమార్ నాయక్ నుంచి పురుషోత్తం ద్వారా గంజాయిని కొనుగోలు చేసి జగిత్యాల జిల్లాకు తరలించి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. రెండేళ్లుగా ఈ అక్రమ దందా సాగిస్తున్నట్లు తమ విచారణలో తేలిందని ఎస్పి తెలిపారు. ముఠా పై ధర్మపురి లో ఔఆఖూ-1985ంఇబి అతీ.నినీ 219/2024 బీ/బ 20 (ఎ) (తితి) (ః) ఔఆఖూ చట్టం క్రింద కేసు నమోదు చేశామని పీడీ యాక్ట్ అమలు చేస్తామని ఎస్పీ చెప్పారు.గంజాయి ముఠాలో ఏ2 గా దినేష్ కుమార్ నాయక్, ం3 గుజ్జల పురుషోత్తం గతంలో రాయగడ పీఎస్‌లో ఎన్‌డిపిఎస్ యాక్ట్ కేసులో జైలుకు వెళ్లగా, ఇద్దరికీ రాయగడలో జైల్ లో పరిచయం ఏర్పడిందని ఎస్పీ తెలిపారు. ఆ పరిచయంతో జైలు నుంచి బయటికి వచ్చాక మళ్లీ గంజాయి స్మగ్లింగ్ దందా సాగిస్తూ ధర్మపురి పోలీసులకు చిక్కారని తెలిపారు. ఇద్దరిపై ఒడిశా లో, విజయనగరం ఉఖీఖ పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు ఉన్నట్లు తెలిపారు.గంజాయి డ్రగ్స్‌పై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడనీ జరుగుతుందని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఓ వైపు గంజాయి పై ఉక్కుపాదం మోపడం తోపాటు గంజాయి డ్రగ్స్ వినియోగంతో ఉత్పన్నమయ్యే పరిణామాల పై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. యువత, పాఠశాల, కళాశాల విద్యార్థులకు దిశా నిర్దేశం చేసే కార్యక్రమలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీ (ఏడీసీ)లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జగిత్యాల ను గంజాయి రహిత జిల్లాగా మార్చుడానికి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహిస్తామని ఎస్పీ చెప్పారు. జిల్లాలో గంజాయికి సంబంధించిన సమాచారం సబంధిత పోలీస్ లకు లేదా డయల్ 100 కు అందించి గంజాయి రహిత జిల్లాగా మర్చడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు.

